క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని/ముత్తారం: మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, యాదవ సంఘం, ముదిరాజ్ ఇతర సంఘాల నుంచి సుమారు 20 మంది గురువారం కాంగ్రెస్‌లో చేరినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. మంథనిలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు గురువారం వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జంగ సమ్మయ్య, మూగ సంపత్, కలవేన సదయ్య, అలవేన తిరుపతి, మూగ రాజేశం, కుక్కల మల్లేశ్, తుమ్మల శ్రీనివాస్, పాండవుల స్వామి, మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్ల బాలాజీ, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య ఉన్నారు.

ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న ఆర్‌ఎం

ఎలిగేడు: మండలంలోని ర్యాకల్‌దేవుపల్లికి చెందిన కాసర్ల రాజిరెడ్డి రెండు నెలల క్రితం యాక్సిడెంట్‌లో మృతి చెందాడు. కాగా మృతుడు ఎలిగేడు ఎస్‌బీఐలో జనరల్ ఇన్సూరెన్స్ రూ.1000 కట్టాడు. దీంతో మృతుడి భార్య కాసర్ల మంజులకు గురువారం మండలకేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో ఇన్సూరెన్స్ ద్వారా వచ్చిన రూ.20.10లక్షల చెక్కును ఆర్‌ఎం అనుపమ్ ఆదర్శ్, బ్యాంకు మేనేజర్ అమరేందర్ నాయక్ అందజేశారు. బ్యాంకు సిబ్బంది నాగరాజు, శ్రీనివాస్, అకౌంటెంట్ ప్రవీణ్‌కుమార్, ఎస్‌బీఐ సీఎస్పీ పెద్ది కుమార్, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ప్రశాంత్, తిరుపతి, లాలపల్లి సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ, సుల్తాన్‌పూర్ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, ముప్పిరితోట సర్పంచ్ ఐలయ్య, నర్సాపూర్ సర్పంచ్ తంగెళ్ల స్వప్నకుమార్, నాగులపల్లి సర్పంచ్ వీరయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖనిటౌన్: 25, 26, 27 తేదీల్లో జరగనున్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ 16వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం కోరారు. కార్మిక హక్కుల కోసం పోరాటం చేస్తున్న ఏఐటీయూసీ మహాసభలను పారిశ్రామిక ప్రాంత విద్యార్థిలోకం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు గొడిసెల ప్రణీత్, సంగె రాహుల్, గాజుల అఖిల్, సంగె అరుణ్ పాల్గొన్నారు.

43మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్స

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 43మందికి గురువారం రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లైసెట్టి భిక్షపతి తెలిపారు. వీరికి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి ఉచిత భోజనం, రవాణా సౌకర్యం కల్పించారని చెప్పారు. సురేశ్, అశోక్‌కుమార్, సంపత్‌రావు, బాబురావు, శ్రీనివాస్, ఇమాం అలీ, చందు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మోసపూరిత పాలన

పెద్దపల్లిరూరల్: ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత సీఎం పీఠమెక్కిన కేసీఆర్ మోసపూరిత పాలన సాగిస్తున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాజు ఆరోపించారు. పెద్దపల్లి మండలం రాగినేడులో గురువారం మన ఊరు..మన ఉష కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు వెంకటేశ్, సవిత, స్వప్న, గోపాల్, అనిల్, ఎండీ రియాజ్, శోభ, అరుణ, సాగర్, ప్రశాంత్, కొమురయ్య, చంద్రశేఖర్, రాహుల్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల సదస్సుకు తరలిరావాలి

ఓదెల: హైదరాబాద్‌లో 27న జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సుకు అధిక సంఖ్యలో తరలిరావాలని ఉద్యమకారుల జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్యయాదవ్ పేర్కొన్నారు. మండలంలోని కొలనూర్ గ్రామంలో గురువారం సదస్సు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి 2వేల మంది ఉద్యమకారులు తరలిరావాలని కోరారు.

మండల రోడ్లకు మహర్దశ

- 20 ఏళ్ల నిరీక్షణకు తెర
- జూలపల్లి నుంచి పెద్దపల్లికి డబుల్‌రోడ్డు మంజూరు
- రూ.44.05కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ



జూలపల్లి: మండల కేంద్రం నుంచి పెద్దపల్లి వెళ్లే రోడ్డు

జూలపల్లి: మండల ప్రజలు ఇరవై ఏళ్లుగా ఎదురుచూస్తున్న జూలపల్లి నుంచి వయా తుర్కల మద్దికుంట డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారై ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన నాయకులు అధికారులు మండల రోడ్లకు నిధులను కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేయడంతో ఇరవై ఏళ్ల నిరీక్షణకు తెరపడింది.

తీరనున్న ప్రజల కష్టాలు

మండలంలో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు జూలపల్లి నుంచి పెద్దపల్లి జిల్లా కేంద్రాన్ని కలుపుతూ డబుల్‌రోడ్డు నిర్మాణానికి రూ.19.80 కోట్లు, పెద్దపల్లి నుంచి వయా తుర్కల మద్దికుంట, కాచాపూర్, జూలపల్లి రోడ్డుకు రూ.7కోట్లు, కటికెనపల్లి నుంచి పెద్దపల్లి వరకు రూ.12కోట్లు, పెద్దాపూర్ నుంచి ఎలిగేడు మండలం లాలపల్లె వరకు రూ.1.60 కోట్లు మంజూరయ్యాయి. కాగా పంచాయతీరాజ్ విభాగం రోడ్లు జూలపల్లి నుంచి తేలుకుంట రోడ్డుకు రూ.2.65కోట్లు, పెద్దాపూర్ నుంచి కుర్మపల్లె రోడ్డుకు రూ.కోటి మొత్తంగా రూ.44.05కోట్ల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ప్రయాణ కష్టాలు తీరుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి



మండల కేంద్రం నుంచి పెద్దపల్లి వైపు వెళ్లే రోడ్డు పూర్తి ధ్వంసమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును త్వరగా నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

– అమరగాని శ్రీనివాస్, జూలపల్లి

నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్

కమాన్‌పూర్: నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని గోదావరిఖని టూటౌన్ సీఐ సూరం వేణుగోపాల్ కోరారు. మండలంలోని జూలపల్లిలో కమాన్‌పూర్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామంలో ఇంటింటా సోదాలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు లేని 40 వాహనాలను సీజ్ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు భద్రత కల్పించడానికి, నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ అఫ్జలుద్దీన్, ఎస్సైలు బేతి రాములు, చంద్రశేఖర్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు చిత్రపటం బహూకరణ



ఓదెల: ఓదెల గ్రామానికి చెందిన ప్రముఖ ఆర్టిస్టు భాస్కర్ల వాసు సీఎం కేసీఆర్‌కు సచివాలయం చిత్రపటం బహూకరించారు. గురువారం ప్రగతిభవన్‌లో సీఎంను కలిసి చిత్రపటం అందించి ఆశీస్సులు పొందారు.

ఐఎఫ్‌టీయూకు ప్రాధాన్యం ఇవ్వండి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలోని ఉన్న కార్మికుల సంఘాలతో సమానంగా ఐఎఫ్‌టీయూకు కూడా ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ గురువారం ఆర్జీ–2 డీజీఎం పర్సనల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్‌కు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ వినతి పత్రం అందజేశారు. సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు నిర్వహించేంత వరకు అన్ని కార్మిక సంఘాలు 15 రిజిస్టర్ కార్మిక సంఘాలను కార్మికుల సమస్యలపై నిర్వహించే సేఫ్టీ కమిటీ మీటింగ్‌లకు పిలవాలని డిప్యూటీ లేబర్ కమిషనర్ సమక్షంలో నిర్ణయం జరిగిందన్నారు. అలా కాకుండా కేవలం జేబీసీసీఐ సంఘాలను మాత్రమే పిలవడం సరికాదన్నారు. నా సింగరేణి యాజమాన్యం విప్లవ ట్రేడ్ యూనియన్ ఐఎఫ్‌టీయూను భాగస్వామ్యం చేయాలన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, రాయమల్లు, నర్సయ్య, రామస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్ కోసం బొల్లిస్వామి దరఖాస్తు

ధర్మారం: ధర్మపురి నియోజకవర్గం స్థానానికి కాంగ్రెస్ టికెట్ కేటాయించాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ బొల్లి స్వామి గురువారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఎలక్టోరల్ బాడీకి అందించారు. స్వామి మాట్లాడుతూ స్థానికుడినైన తనకు పార్టీ టికెట్ కెటాయిస్తే గెలుస్తున్నానని అన్నారు. ప్రజల మద్దతు ఉన్న తనకు పార్టీ టికెట్ కేటాయించాలని కోరారు.

మహాధర్నా విజయవంతం చేయండి

రామగిరి: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 29న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు ఆకుల వెంకన్న పిలుపునిచ్చారు. ఆర్జీ–3 డివిజన్‌లోని వివిధ విభాగాల్లో పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో గురువారం సమావేశం నిర్వహించి మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాధర్నాలో కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్ కార్మికులు మోహన్, మురళి, సదానందం, రమేశ్, సంపత్, రాజమౌళి పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్: పదహారేళ్ల కాలంగా కాంట్రాక్టు ఉద్యోగులుగా సేవలందిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని బీజేపీ నాయకుడు సదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఏఎన్‌ఎం దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. నాయకులు సతీశ్, ప్రవీణ్, తిరుపతి, అంజిబాబు, శ్రీనివాస్, శేఖర్, లక్ష్మణ్ ఉన్నారు.

నోటిఫికేషన్ పత్రాల దహనం..

న్యాయమైన డిమాండ్ల కోసం రెండో ఏఎన్‌ఎంలు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ పత్రాలను గురువారం సీపీఐ, సీఐటీయూ నాయకులు దహనం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఏఐటీయూసీ నాయకులు రమేశ్, కదారి సునీల్, ఏఎన్‌ఎంల సంఘం నాయకులు స్వరూప, రాణి, సుజాత, సునీత, రమాదేవి, అరుణ, శారద, సునీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

గోదావరిఖని: పార్టీ గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు యజ్ఞంలా ముందుకు సాగాలని మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే రానా జగదీష్‌సిన్హా, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక మేదరిబస్తీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన 8 మండలాల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, బీజేపీ ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. డివిజన్, బూత్ కమిటీలు త్వరగా వేయాలని, వారితో నిత్యం మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, నాయకులు వడ్డేపల్లి రాంచందర్, పిడుగు కృష్ణ, దీటి వెంకటస్వామి, సోమారపు లావణ్య, సోమారపు అరుణ్‌కుమార్, మంచికట్ల భిక్షపతి, దుబాసి లలిత, కుసుమ కుమారి, కోదాటి ప్రవీణ్, జనగామ రాజలింగం పాల్గొన్నారు.

ప్రజాగర్జన సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే



రేవంత్‌రెడ్డితో విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: ప్రజాగర్జన పేరిట చేవెళ్లలో 26న నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లపై చర్చించేందుకు గురువారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో కలిసి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొన్నారు. విజయరమణారావు పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

✦ఎగ్జిబిషన్‌ను వెంటనే ఎత్తివేయాలి

గోదావరిఖనిటౌన్: విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కళాశాల గ్రౌండ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అన్యాయమని వెంటనే ఎత్తివేయాలని ఎంఎస్‌ఎఫ్ నాయకులు గుండ్ల మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్, ఎంఎస్‌ఎఫ్ నాయకుడు మహేశ్ పాల్గొన్నారు.

✦కార్పొరేట్ వర్క్‌షాప్స్ జీఎంకు సన్మానం

గోదావరిఖని: ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న సింగరేణి కార్పొరేట్ వర్క్‌షాప్స్ జీఎం ఎస్.నాగేశ్వర్‌రావును ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ గురువారం సన్మానించారు. జీఎం చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఏరియా ఇంజినీర్ నరసింహరావ్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, ఫైనాన్స్ డీజీఎం వెంకటరామచంద్ర, పర్చేజ్ ఎస్ఈ చంద్రరాజు, క్వాలిటీ డిప్యూటీ మేనేజర్ వెంకటమోహన్ పాల్గొన్నారు.

✦కారుణ్య నియామక పత్రం అందజేత

గోదావరిఖని: మెడికల్ బోర్డు ద్వారా ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుడి డిపెండెంట్ దూడ రమేశ్‌కు ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ గురువారం కారుణ్య నియామక పత్రం అందజేశారు. ఎస్‌ఓటూ జీఎం రామ్మోహన్, డీజీఎం పర్సనల్ సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

✦బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తి రిమాండ్

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్‌కు చెందిన నీరటి కర్ణాకర్ గతంలో నాటుసారా తయారు చేస్తుండగా పట్టుకొని, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎక్సైజ్ మంథని సీఐ గురవయ్య తెలిపారు. అతను నిబంధనలు ఉల్లంఘించి, మళ్లీ నాటుసారా తయారు చేస్తుండగా పట్టుకున్నామని అన్నారు. అబ్కారీశాఖ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు కర్ణాకర్‌ను రిమాండ్ నిమిత్తం గురువారం కరీంనగర్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

✦కార్మికులకు వైద్య పరీక్షలు

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంట, వడ్కాపూర్, కాచాపూర్, వెంకట్రావుపల్లె గ్రామాల్లో సీఎస్‌సీ హెల్త్‌కార్డులు ఉన్న కార్మికులకు గురువారం హెల్త్ కేర్ టీమ్ వైద్య సిబ్బంది పరీక్షలు చేశారు.

టీబీపై అవగాహన, ర్యాలీ

మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిక్షయ్ పోషణ్ అభియాన్‌లో భాగంగా, గురువారం టీబీ వ్యాధిపై వైద్యాధికారి సంపత్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.


✦క్రీడలతో శారీరక దారుఢ్యం

పాలకుర్తి: క్రీడలతో శారీరక దారుఢ్యం పెంపొందడమే కాకుండా మానసిక ఉల్లాసం కలుగుతుందని మండల విద్యాధికారి సంపత్‌రావు అన్నారు. బసంత్‌నగర్‌లోని ఇండియా మిషన్ సెకండరీ పాఠశాల ఆవరణలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈవో ప్రారంభించారు. అండర్ 14, 17 విభాగాల్లో బాలురకు అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కాగా శనివారం బాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ శోభారాణి పేర్కొన్నారు.

ఖబరిస్తాన్‌కు సింగరేణి స్థలం కేటాయింపు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాంత ముస్లిం మైనార్టీ సభ్యుల వినతి మేరకు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సింగరేణి సంస్థ ఉన్నతాధికారులతో చర్చించి స్థల కేటాయింపు జరిగిందని, త్వరలోనే పూర్తిస్థాయి అనుమతి పత్రాలు అందనున్నట్లు రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ తెలిపారు. ఆటోనగర్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థలం కేటాయింపు జరగలేదని కాంగ్రెస్ నాయకుడు చేస్తున్న ఆరోపణలు సరికావన్నారు. మైనార్టీ నాయకులు ఉన్నారు.

భవన కార్మికులకు మోటార్ సైకిళ్లు ఇవ్వండి



నిరసన తెలుపుతున్న నాయకులు

గోదావరిఖని: భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి డిమాండ్ చేశారు. గురువారం గోదావరిఖనిలోని ఏఎల్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2022లో నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లు, మహిళా కార్మికులకు స్కూటీలు ఇస్తామని ప్రకటించిందని తెలిపారు. ఏడాది దాటినా ఆ హామీ నెరవేరలేదన్నారు. బయోమెట్రిక్ విధానం వల్ల కార్మికులు నష్టపోతున్నారని, రద్దు చేసి, ఐరిష్ పద్ధతి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తుంగపిండి మల్లేశ్, నాయకులు శ్రీనివాస్, గుండు కనకయ్య పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయండి



నిరసన తెలుపుతున్న కార్మికులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని జీజీహెచ్ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులందరినీ రాష్ట్రంలో రెగ్యులరైజ్ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుతామని హామీ ఇచ్చిన కేసీఆర్ హామీ నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా రెగ్యులర్ చేయాలని కోరారు. ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు కరీం, చంద్రశేఖర్, ఆసుపత్రి విభాగం నాయకులు, ఐలయ్య, రవి మల్లేశ్, కోట వెంకన్న, ఐలమ్మ సుశీల, పుష్ప, మల్లమ్మ, హనుమంతు, ఈశ్వర్, రాంబాబు, సరిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అపోహలు వీడి నేత్రదానం చేయండి



అభినందన పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

కోల్‌సిటీ: అపోహలు వీడి అందరూ నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని పలువురు ప్రతినిధులు పిలుపునిచ్చారు. రామగుండం కార్పొరేషన్ మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ తల్లి మల్లమ్మ(75) 14న రాత్రి మృతి చెందగా ఆమె నేత్రాలు దానం చేసి మరో ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించారు. ఈ సందర్భంగా గురువారం నేత్రదాత మల్లమ్మ సంస్మరణ సభను సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి నిర్వహించారు. నేత్రదాత కొడుకులు, కోడళ్లు లక్ష్మీనారాయణ–మంగ, శంకర్–లలిత, కూతురు, అల్లుడు సరిత–తిరుపతిని మాజీ ఎమ్మెల్యే కాశిపేట లింగయ్య, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వంశీ, పలు సంఘాల ప్రతినిధులు గుమ్మడి కుమారస్వామి, మిర్యాల రాజిరెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య, బొంతల రాజేశ్, రాజు అభినందించారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు రాజమౌళి, వాసు, బాణయ్య, రాజహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యంత్ర సామగ్రి కొనుగోలుకు ప్రణాళిక



మాట్లాడుతున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: యంత్ర సామగ్రి కొనుగోలుకు ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, కార్పొరేట్ జీఎం రవికుమార్ ఆదేశించారు. జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆయా గనులు, ఓసీపీలకు కావాల్సిన యంత్రాలు, యంత్ర సామగ్రి, ఎలక్ట్రికల్ మిషినరీ, సర్వీస్ కెపాసిటర్స్, ప్లాంట్, పనిముట్లు, కావాల్సిన సదుపాయాలపై చర్చించారు. ఏరియా ఇంజినీరు రామ్మూర్తి, ఎస్‌ఓటూ జీఎం రామ్మోహన్, ఏజెంట్ శ్రీనివాస్, వర్క్‌షాప్ డీజీఎం మదన్‌మోహన్, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

‘చంద్రయాన్–3’ సంబరాలు



సంబరాల్లో యూత్ అసోసియేషన్ సభ్యులు

ఎలిగేడు: ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్–3 విజయవంతం కావడంతో మండలంలోని ధూళికట్టలో యాదవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సంబరాలు జరుపుకున్నారు. యూత్ సభ్యులు గ్రామంలో జాతీయ జెండాతో బైక్ ర్యాలీ నిర్వహించారు.

నరకప్రాయంగా మారిన ఫోర్‌లేన్



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

పాలకుర్తి: రామగుండం నియోజకవర్గ పరిధిలో ఫోర్‌లేన్ నరకప్రాయంగా మారిందని, అసంపూర్తిగా ఉన్న రహదారి మూలంగా ఎంతోమంది ప్రమాదాలబారిన పడి తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవునూరి సంపత్ అన్నారు. బసంత్‌నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్‌తో కలిసి మాట్లాడారు. బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద కనీస సౌకర్యాలు లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, టోల్ వసూల్ చేసే కొంటర్లు కూడా ఎక్కువ మొత్తంలో లేనికారణంగా వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. బసంత్‌నగర్ సమీపంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు పెండింగ్‌లో ఉండడం మూలంగా ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని, గోదావరిఖని జీఎం కార్యాలయం సమీపంలోని మూలమలుపు వద్ద ఫ్లై ఓవర్ నిర్మించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది మృత్యువాతపడుతున్నారని వాపోయారు. త్వరితగతిన పెండింగ్ పనులు పూర్తి చేసి వాహనదారులకు టోల్‌ప్లాజా వద్ద సరైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రామగుండం నియోజకవర్గ అధ్యక్షుడు కాసిపేట స్వామి, గజ్జెల వంశీ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను గుర్తించకపోవడం అన్యాయం



మాట్లాడుతున్న నాయకులు

మంథని: సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితాలో 50లక్షల జనాభా ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గానికి ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం అన్యాయమని ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ ఇన్‌చార్జి అట్టెం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. తమ కులానికి జరిగిన అన్యాయంపై బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఊదరి మల్లేశ్, ఓదెలు, సాగర్ల తిరుపతి, మల్లయ్య, సాదువుల తిరుపతి, ఊదరి నాగరాజు, గంగుల శంకర్ రాచకొండ శంకర్, ఆదర్శ ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నియోజకవర్గం నుంచి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని నల్ల మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో గురువారం తన అభిమానులు, అనుచరులతో కలిసి బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి, పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. వయోభారంతో ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ ప్రకటించడం యువతకు అన్యాయం చేసినట్టేనన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంథని: పెరిక సంఘం భవన నిర్మాణ భూమి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శేఖర్, రాష్ట్ర నాయకుడు అర్జున్‌రావు పిలుపునిచ్చారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో గురువారం పోస్టర్ ఆవిష్కరించారు.

పత్తి, మిర్చి పంటలపై అవగాహన

ముత్తారం: స్థానిక రైతు వేదికలో గురువారం రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాస్, వెంకన్న, భాస్కర్, వినోద్‌లు రైతులకు పత్తి, మిర్చి పంటలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు డబ్ల్యూడబ్ల్యూఎఫ్–బీసీఐ ఆధ్వర్యంలో పంటల సంరక్షణ చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్, బీసీఐ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ సతీశ్‌కుమార్, చంద్రమౌళి, సమ్మయ్య, మహేందర్, యుగంధర్, వైస్ ఎంపీపీ రవీందర్‌రావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.